నరక ప్రయాణం..!

- అధ్వానంగా నిషాని గ్రామ రోడ్డు
- ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కంకర తేలిన నిషాని రోడ్డు

కెరమెరి: ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న ప్రజలను ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టించుకోవడం లేదు. అనేక సమస్యల మధ్య జీవిస్తున్నారు. కనీసం గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఓ వైపు వైపు అటవీశాఖ అనుమతులు లేక, మరో వైపు రోడ్డు నిర్మించక సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

రాళ్ల రప్పలు మధ్య నడక..

మండలంలోని నిషాని గ్రామ పంచాయతీలో సుమారు 420 కుటుంబాలు ఉండగా.. 1234 జనాభా ఉంది. నిసాని, గోండ్‌గూడ, బారేగుడ, పర్‌ధాన్‌గూడ, బెస్తగూడ ఉంది. కుమురం భీం ప్రాజెక్టులో ముంపుకు గురైన గ్రామం ఇది. కెరమెరి నుంచి నిసానికి వెళ్లాంటే ఉమ్రి, ఇందాపూర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. దేవుడ్‌పల్లి గ్రామస్తులకు నిషానికి వెళ్లే దారిలో పునరావాసం కల్పించారు. పునరావాసం కాలనీ వరకు సదరు గుత్తేదారు బీటీరోడ్డు వేసినప్పటికీ మిగిలిన రెండు కిలో మీటర్ల రోడ్డు సరిగా లేక ప్రజలు నరకం చేస్తున్నారు. రాళ్ల రప్పలు తేలి నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. వానాకాలంలో మాత్రం వారి కష్టాలు అన్నిఇన్ని కావు. ఆ గ్రామాల ప్రజలు ఆసిఫాబాద్ మీదుగా కెరమెరికి రావాల్సి ఉంటుంది. 25 కిలో మీటర్లకు బదులుగా 50 కిలో మీటర్ల దూరం పడతుంది.

ఆగుర్‌వాడ గ్రామం నుంచి ఉమ్రికి వెళ్లే రోడ్డు పూర్తిగా రాళ్లరప్పలతో ఉంది. అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో అధికారులు గతంలో రోడ్డును నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాని

నరకం చూపిస్తున్న రోడ్డు..

గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వానాకాలంలో ఎక్కడికక్కడ రెండు ముక్కలు మారడంతో పాదచారులతో పాటు ఎలాంటి వాహనాలు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కంకర తేలి ఉంది



ఏదో పని నిమిత్తం కెరమెరికి వెళ్లాల్సి వస్తే నరకం చూడాల్సి వస్తుంది. నిసాని నుంచి దేవుడ్‌పల్లి పునరావాస కేంద్రం వరకు బండలు, కంకర తేలి ఉండడంతో కష్టంగా మారింది. ఆగుర్‌వాడ నుంచి ఉమ్రి వరకు ఉన్న రోడ్డుకు అటవీ అనుమతులు లేక కష్టమవుతుంది.

– చహకటి దాము, గ్రామపటేల్, నిసాని


‘అమ్మానాన్న నన్ను క్షమించండి’

- సూసైడ్ నోట్ రాసిన డీ ఫార్మసీ విద్యార్థి
- ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య



దుర్గం నితిన్ (ఫైల్)

దహెగాం: ‘అమ్మా నాన్న నన్ను క్షమించండి.. నేను చేసింది తప్పు అని తెలిసి నా తప్పడం లేదు. మీరు నాకోసం చాలా చేశారు. నేను మీకు ఏమీ చేయలేక పోతున్నా.. ఈ జీవితానికి ఇంతే..’ అంటూ జీవితంపై విరక్తి చెంది ఓ డీ ఫార్మసీ విద్యార్థి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. దహెగాం మండలం పీపీరావు కాలనీకి చెందిన దుర్గం నితిన్(23) కరీంనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఫార్మా-డీ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కాగా అతను బుధవారం మధ్యాహ్నం కరీంనగర్ నుంచి ఇంటికి చేరుకున్నాడు. గురువారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. ఊరికి వెళ్లిన అన్నయ్య ఓంరాజ్ ఇంటికి వచ్చి చూడగా నితిన్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పక్కింటి వారిని పిలిచి కిందకు దించాడు. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. నితిన్ తండ్రి సకారాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఉత్తం తెలిపారు. నితిన్ వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో ‘నా చావుకు ఎవరు కారణం కాదు. జీవితంపై విరక్తితోనే చనిపోతున్నా’ అని రాసి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.



నితిన్ రాసిన సూసైడ్ నోట్

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం



కొలతలు తీస్తున్న సిబ్బంది

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి ఆనుకొని బుధవారం ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణ పనులను డీఈ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ మేరకు మార్కింగ్ ఇచ్చారు. మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇది నమూనా ఇల్లు మాత్రమేనని, జిల్లాలో ఎన్నికైన గ్రామ పంచాయతీల్లో ఇలాంటి ఇంటి నిర్మాణం చేయాలని లబ్ధిదారులకు తెలిపేందుకే ఇది నిర్మించడం జరుగుతుందన్నారు. హాల్, కిచెన్, బెడ్‌రూం, బాత్రూం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

తిర్యాణి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి గణపతి ఆలయ వారికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ అర్చన, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, సభ్యులు మార్క శంకర్ గౌడ్, అన్నం వెంకటేశం, బోగ్గుల సకరాం, శ్రీకాంత్, శివప్రసాద్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

సిర్పూర్(టి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి నుంచి బైక్‌పై దేశీదారు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా రూ.13,500 విలువైన 240 దేశీదారు క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

వాంకిడి: మండలంలోని ఘాట్ జనగాం గ్రామంలో అక్రమంగా కొనుగోలు చేసిన 14.12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట డీటీ రాజ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏపీ 25 క్యూ 1955 నంబరు గల వాహనాన్ని వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి డ్రైవర్ షేక్ మున్నా, వాహన యాజమాని షేక్ ముస్తాఫ్ అలీ, మహారాష్ట్రకు చెందిన బియ్యం కొనుగోలుదారుడు ఖలీల్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

‘అనుచిత వ్యాఖ్యలు సరికాదు’

తిర్యాణి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు జైనూర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంపై విమర్శలు చేసేముందు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

ఆధార్‌కార్డు మంజూరయ్యేలా చూడాలి

రెబ్బెన: మండల కేంద్రంలో గుర్మా వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శివ, రూప దంపతుల పిల్ల లకు ఆధార్‌కార్డు మంజూరయ్యేలా చూడాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. గురువారం బాధిత కుటుంబంతో కలిసి తహసీల్దార్ రామ్మోహన్‌రావును కలిశారు. శివ, రూప దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారిలో నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారని అన్నారు. అయితే పిల్లలకు ఇప్పటి వరకు ఆధార్‌కార్డు లేకపోవటంతో పాఠశాలల్లో చేర్పించుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించటం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు బాధిత కుటుంబానికి నివాస ధ్రువపత్రంతో పాటు ఆధార్‌కార్డులు మంజూరయ్యేలా చూడాలని కోరారు.

క్రీడా పరికరాలు అందజేత

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన యువతకు మాజీ ఎంపీటీసీ నారాయణ రెడ్డి రూ.20 వేల విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. యువత మంచి మార్గంలో నడవాలన్నారు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కారెం రవి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న ఏళ్లనాటి కల



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దహెగాం: ఎన్నో ఏళ్ల నాటి కళ నెరవేరుతుందని మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. మండలంలోని ఇట్యాల నుంచి భీమిని వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ చొరవతో రోడ్డు నిర్మాణానికి 1.37 కోట్లు మంజూరు చేయించారు. కాగా.. మండలంలోని ఇట్యాల గ్రామంలో ఎమ్మెల్సీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజుల బ్రహ్మయ్య, గజ్జెల సురేశ్, మధూకర్ పాల్గొన్నారు.

గుండి గ్రామానికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గుండి గ్రామానికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. టీకానంద్, గొడిసెల కార్తీక్‌లు మాట్లాడుతూ.. అప్రోచ్ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారని, కనీసం రహదారికి మరమ్మతులు కూడా చేయలేదన్నారు. అధికారులకు సమస్యను విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

వాంకిడి: మండల అధికారులు నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలని మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 1–19 ఏళ్ల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, పంచాయతీ కార్యదర్శులు, విద్యా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కౌటాల: మండలంలోని తాటినగర్ చౌరస్తాలో గురువారం గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండె విఠల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ చొరవతో మొగడ్‌దగడ్ నుంచి తాటినగర్ వరకు రోడ్డు మరమ్మతులకు రూ. 2 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు రత్నం సోమయ్య, కలీం పాషా, సుధాకర్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి’



మాట్లాడుతున్న భుజంగ్‌రావు

ఉట్నూర్‌రూరల్: విద్యారంగం అభివృద్ధి చెందాలంటే విద్యారంగానికి చెందిన వారిని, టీచర్ల సమస్యలు తెలిసిన వారిని గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్పొరేట్ వ్యయక్తులను, ధనస్వామిక వ్యక్తులను ఓడించి ఎల్లప్పుడు విద్య కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే అశోక్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అశోక్‌కుమార్‌ను కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవడం టీపీటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, గంగాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్టీలు

- తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణ గాలికి
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



చెత్తాచెదారంతో నిండిని నీటితొట్టి

లింగాపూర్: రోజురోజుకూ ఎండలు ముదిరిపోవడంతో పశువుల దాహర్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టీలు నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో నీటి తొట్టీలు నిర్మించింది. నీటి సౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ కుళాయిల వద్ద ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ చేపట్టక పోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు కూడా చేరాయి. దీంతో పశువులు దాహర్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి.

పంచాయతీలదే బాధ్యత..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని 30కిపైగా గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 20కి పైగా నీటి తొట్టీలను పశువుల దాహర్తి తీర్చేందుకు నిర్మించారు. ఒకొక్క నీటితొట్టి రూ. 30 వేలతో నిర్మించారు. నీటితొట్టి బాధ్యత ప్రభుత్వం పంచాయతీలకే అప్పగించింది. అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో వాటిని గాలికి వదిలేశారు. దీంతో అపరిశుభ్రంగా ఉండడంతో పాటు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన నీటి తొట్టీలను నిర్మించారు కానీ నీరు నిల్వ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్టీలను వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.

నీటిని నింపాలి



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్మించిన నీటితొట్టీల్లో నీటిని నింపాలి. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. శిథిలావస్థకు చేరిన వాటికి మరమ్మతులు చేయించాలి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

– జాదవ్ విలాష్, లింగాపూర్, రైతు

కొత్తవి నిర్మించాలి



వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం, ద్వారా పశువుల దాహర్తి తీర్చేందుకు నీటి తొట్టీలను నిర్మించాలి. నీటి సౌకర్యం లేక పశువులను విక్రయించాల్సిన పరిస్థితి. ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

–జాటోత్ రాహుల్, లింగాపూర్, రైతు

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

బోథ్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్) ఇటీవల రెడ్డి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు ఆయనపై మండిపడ్డారు. గురువారం మల్లన్న దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, బస్టాండ్ వద్ద దహనం చేశారు. రెడ్డి కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను గురువారం కంపెనీ ప్రతినిధి గిరిష్, మాజీ సర్పంచ్ ఫైజుల్లాఖాన్‌లు ప్రారంభించారు. ఎరువుల విక్రయ కేంద్రాల డీలర్లు శ్రీకాంత్‌రెడ్డి, సుశాంత్‌రెడ్డి, హెచ్ఎం మాయకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయవార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో శుక్రవారం శబరిమాత ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల తర్వాత, శబరిమాత పల్లకిని ఊరేగించనున్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్యే కోవలక్ష్మి జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆమె నివాసంలో కేక్‌కట్ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే భర్త సోనేరావ్‌తో కలిసి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా.. అర్చకులు మధుకర్‌శర్మ ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. సింగరేణి జీఎం శ్రీనివాస్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అహ్మద్‌తో పాటు నాయకుడు వినోద్ జైస్వాల్, రక్తదానం చేయగా వారికి ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు అలీబిన్ అహ్మద్, అబ్దుల్లా, రవీందర్, బలరాం, అన్సార్, నిసార్, రవి, జావిద్, ఇమ్రాన్, తాజ్ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఓరుగల్లు వన్యప్రాణుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సభ్యుల బృందం సుగుణను మర్యాద పూర్వకంగా కలిశారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల స్థితిగతులపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. టైగర్‌జోన్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు ఉపాధి కల్పించి ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల కోసమే ఆధార్ సెంటర్ ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రాథోడ్ మానుకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమాచారం ఇచ్చి ఆధార్‌లో చిన్న మార్పులు, చేర్పులకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆధార్ సెంటర్ నిర్వాహకులు దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.